# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 244
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
జూన్ 28, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

- ఆరోగ్య కమిషనర్ డా. సంగీత సత్యనారాయణ

# ఎమ్మెల్యే సాబ్.. జర చూడు



వివరాలు 2లో..




**కాంగ్రెస్ భవన్-బుద్ధభవన్ రోడ్డుకు మోక్షమెప్పుడో?**

**రోడ్డు విస్తరణలో జాప్యం**

**స్థానిక ఎమ్మెల్యేపై స్థానికుల ఆగ్రహం**

**పనులను మొదలుపెట్టాలని డిమాండ్**

హనుమకొండలోని కాంగ్రెస్ భవన్ - బుద్ధభవన్ రోడ్డు విస్తరణ పనులు నత్తకు నడక నేర్పిన చందంగా తయారయ్యాయి. "రేపు, మాపు" అంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్పా, దశాబ్దకాలంగా అసంపూర్తిగా పడి ఉన్న ఈ రోడ్డు పనులకు మాత్రం మోక్షం లభించడం లేదు. రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతున్నా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలో చలనం లేకపోవడం పట్ల స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిత్యం వేలాది మంది ఈ రోడ్డు గుండానే ప్రయాణాలు చేస్తుండటంతో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది. స్థానిక ఎమ్మెల్యేగా ఉండటంతో పాటు అధికార కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న నాయిని రాజేందర్ రెడ్డి నిత్యం తన పార్టీ కార్యక్రమాలకు ఇదే దారి గుండా వస్తుంటారు, పోతుంటారు. అయినా ఈ సమస్యల పరిష్కారం చూపకపోవడం పట్ల బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల ఇబ్బందులను తీర్చడంలో ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి కొరవడిందని స్థానికులు మండిపడుతున్నారు. - వరంగల్ వాయిస్, హన్మకొండ

## పీవీ సంస్కరణలతోనే పటిష్టంగా దేశ ఆర్థిక వ్యవస్థ

**తొలి తెలుగు ప్రధానిగా పీవీకి ప్రత్యేక స్థానం | పీవీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని**



8లో..



## శ్రీ పీవీ తెలంగాణ రవి

- దేశం దశ, దిశ మార్చిన నేత పీవీ
- కాంగ్రెస్ పీవీని విస్మరించడం శోచనీయం
- శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ
- బీఆర్ఎస్ నాయకుల ఘన నివాళి

# ఎమ్మెల్యే సాబ్... జర చూడు



- కాంగ్రెస్ భవన్-బుద్ధభవన్ రోడ్డుకు మోక్షమెప్పుడో?
- రోడ్డు విస్తరణలో జాప్యం
- స్థానిక ఎమ్మెల్యేపై స్థానికుల ఆగ్రహం
- పనులను మొదలుపెట్టాలని డిమాండ్

**వరంగల్ వాయిస్, హన్మకొండ:** హనుమకొండలోని కాంగ్రెస్ భవన్ – బుద్ధభవన్ రోడ్డు విస్తరణ పనులు నత్తకు నడక నేర్పిన చందంగా తయారయ్యాయి. "రేపు, మాపు" అంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్పా, దశాబ్దకాలంగా అసంపూర్తిగా పడి ఉన్న ఈ రోడ్డు పనులకు మాత్రం మోక్షం లభించడం లేదు. రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతున్నా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిలో చలనం లేకపోవడం పట్ల స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిత్యం వేలాది మంది ఈ రోడ్డు గుండానే ప్రయాణాలు చేస్తుండటంతో సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది. స్థానిక ఎమ్మెల్యేగా ఉండటంతో పాటు అధికార కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న నాయిని రాజేందర్ రెడ్డి నిత్యం తన పార్టీ కార్యక్రమాలకు ఇదే దారి గుండా వస్తుంటారు, పోతుంటారు. అయినా ఈ సమస్యల పరిష్కారం చూపకపోవడం పట్ల బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల ఇబ్బందులను తీర్చడంలో ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి కొరవడిందని స్థానికులు మండిపడుతున్నారు.

రాజకీయ నాయకుల అలసత్వం, నిధుల కొరత వంటి అనేక కారణాలతో నిలిచిపోయిన హనుమకొండలోని కాంగ్రెస్ భవన్ – బుద్ధభవన్ రోడ్డు విస్తరణ పనులపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చొరవతో ఈ పనులు తిరిగి ఊపందుకున్నాయని అందరూ భావించారు. అయితే, గత ప్రభుత్వాల మాదిరిగానే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలోనూ నిర్లక్ష్యం రాజ్యమేలుతోందని స్థానికులు దుయ్యబడుతున్నారు. దశాబ్దకాలంగా ఈ రోడ్డు సమస్యకు పరిష్కారం లభించకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

## ప్రతిపాదనలు చేశారు..పనులు మరిచారు

దాదాపు పదేళ్ల క్రితం, కాంగ్రెస్ భవన్ నుంచి కేయూ బైపాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డు వేసేందుకు అప్పటి ప్రభుత్వం సీఎం నిధుల నుంచి రూ.2 కోట్లు కేటాయించినట్లు ప్రకటించింది. అయితే, రాజకీయ గ్రహణం, నిధుల విడుదలలో జాప్యం కారణంగా ఈ ప్రతిపాదనలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. నగరంలో పెరుగుతున్న అభివృద్ధి, దానికి అనుగుణంగా తీవ్రతరమవుతున్న ట్రాఫిక్ సమస్య దృష్ట్యా ఈ రోడ్డు విస్తరణ అనివార్యంగా మారింది. కానీ ఇప్పటికీ ఈ పనులు ఎటూ తేలకపోవడం పట్ల స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

## పనుల ప్రారంభంపై అనుమానాలు!

కాంగ్రెస్ భవన్ –బుద్ధభవన్ రోడ్డు విస్తరణకు సంబంధించి అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నా, వాస్తవ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇటీవల జరిగిన వరంగల్ మహానగర మాస్టర్ ప్లాన్ సమీక్షలో, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో కాంగ్రెస్ భవన్ నుంచి బుద్ధభవన్ మీదుగా కేయూ బైపాస్ రోడ్డు వరకు 80 ఫీట్ల రోడ్డు వేసేందుకు రూపొందించిన విస్తరణ ప్రణాళికలకు అధికారులు ఆమోదం తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగానే కాంగ్రెస్ భవన్ నుంచి బుద్ధభవన్ వెళ్లే మార్గంలో ఏ వన్ మటన్ షాప్ వద్ద ఇరువైపులా కల్వర్టుల నిర్మాణం నెల రోజుల క్రితం ప్రారంభమై ఇటీవలే పూర్తయ్యాయి. ఇది శుభపరిణామంగా స్థానికులు భావిస్తున్నారు. అయితే, కల్వర్టుల పనులు పూర్తయినా ప్రధాన రోడ్డు విస్తరణ పనులు మాత్రం ఇంకా మొదలు కాకపోవడంపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "ఏమైనా రాజకీయ ఒత్తిళ్లు ఎదురయ్యాయా? అధికారులు ప్రణాళిక ప్రకారం రోడ్డును అభివృద్ధి చేస్తారా, లేక గత ప్రభుత్వాల మాదిరిగానే ప్రారంభించి మధ్యలోనే వదిలేస్తారా?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## మా కష్టాలు ఎప్పుడు తీరతాయి?

దశాబ్దన్నర కాలంగా కేవలం మాటలకే పరిమితమైన బుద్ధభవన్ రోడ్డు విస్తరణపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "దాదాపు పదిహేనేళ్లుగా రోడ్డును వెడల్పు చేస్తామని నాయకులు చెబుతున్నారు, కానీ కనీసం ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదు" అని వారు మండిపడుతున్నారు. నగరం ఇంత అభివృద్ధి చెందుతున్నా, ఈ కీలకమైన రోడ్డును ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదని నిలదీస్తున్నారు. కాంగ్రెస్ భవన్ నుంచి కేయూ బైపాస్ రోడ్డు వరకు బుద్ధభవన్ మీదుగా ప్రయాణించాలంటే ప్రస్తుతం కనీసం అరగంట పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి ఆనుకోని ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ తోవాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీకి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించే క్రమంలో పార్టీకి వచ్చే వీఐపీల కార్లు, వాహనాలు రోడ్డుపైనే పార్క్ చేయడం మూలంగా తీవ్రంగా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయిని స్థానికులు మండిపడుతున్నారు. ఇరుకైన రోడ్లు, గుంతలమయమైన దారిలో రాత్రి వేళల్లో, ముఖ్యంగా వర్షాకాలంలో వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా, అడ్డంకులను అధిగమించి ఈ రోడ్డును విస్తరిస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని, తక్షణమే రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.








# సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

## ఆరోగ్య కమిషనర్ డా. సంగీత సత్యనారాయణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సంబంధిత ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో పని చేస్తూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్. సంగీత సత్యనారాయణ సూచించారు. శనివారం హరిత కాకతీయ హనుమకొండలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సీజనల్ వ్యాధులు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లాల వారీగా నమోదవుతున్న మలేరియా, డెంగ్యూ, ఇతర వ్యాధుల వివరాలను ఆమె సమీక్షించారు. వరంగల్ డీఎంహెచ్ఓ, సంబంధిత అధికారులు ప్రతిరోజు ఎంజీఎం ఆస్పత్రిలో నమోదవుతున్న మలేరియా, డెంగ్యూ పాజిటివ్ కేసుల వివరాలను సాయంత్రం ఆరు గంటల లోపు సంబంధిత జిల్లాల డీఎంహెచ్ఓలకు అందించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య, వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ బి. సాంబశివరావు, ములుగు డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్ రావు, జనగామ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లికార్జున్, మహబూబాబాద్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి హనుమకొండలోని హంటర్ రోడ్‌లో ఉన్న ధర్మసాగర్ మండల సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను, కరుణాపురంలోని మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ బాలికల విద్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ధర్మసాగర్ మండల సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన కడియం శ్రీహరి తరగతి గదుల నిర్వహణ, త్రాగునీటి సౌకర్యం, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. పాఠశాలలోని సదుపాయాలు, పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, అలాగే సీజనల్ జ్వరాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినులను ఆత్మీయంగా పలకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, క్లాస్ రూంలోకి వెళ్లి పాఠం చెప్పడమే కాకుండా, వారిని పలు ప్రశ్నలు అడిగి ప్రోత్సహించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను చూసి చలించిపోయిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వెంటనే గురుకుల సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఫర్నిచర్ లేకపోవడంతో విద్యార్థులు కింద కూర్చుంటున్నారని, హాట్ వాటర్ సౌకర్యం కల్పించాలని, జూలై నెల పూర్తి కాకముందే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సమకూర్చాలని గురుకుల సెక్రటరీని ఎమ్మెల్యే కోరారు. ప్రస్తుతం హంటర్ రోడ్‌లో నిర్వహిస్తున్న ధర్మసాగర్ మండల సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను త్వరలోనే అన్ని సౌకర్యాలు ఉన్న కొత్త భవనానికి తరలించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించే విధంగా విద్యను అందించాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు.



# ఎన్నికల వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలి

## ● ఎంసీపీఐ(యూ) నేత హంసారెడ్డి డిమాండ్



**వరంగల్ వాయిస్, దామెర :** ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలనిఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్. రెడ్డి హంసారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంసీపీఐ(యూ) పార్టీ ఆధ్వర్యంలో దామెర తహసీల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపించారని గుర్తుచేశారు. ఏడవ గ్యారంటీగా భావించిన ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణను కూడా ప్రజలు విశ్వసించారని పేర్కొన్నారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకటి, రెండు హామీలు మినహా మిగిలిన ఎన్నికల హామీలకు బడ్జెట్ లేదు అనే పేరుతో ఈ ఆరు నెలల కాలాన్ని గడిపారని విమర్శించారు. ప్రజాస్వామిక హక్కులపై గత పాలకుల వలె నిర్బంధాలు తీవ్రమయ్యాయని, గత పాలకులను ఓడించి గద్దెనెక్కించినా, పరిపాలనను ప్రజానుకూలంగా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో దోపిడీ విచ్చలవిడిగా పెరిగిందని, సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నప్పటికీ గ్రామాల్లో హెల్త్ క్యాంపులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ వందలాది గ్రామాలకు బస్సు సౌకర్యం లేదని, జాతీయ రహదారులు మినహా మిగిలిన రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ మాఫియా తమ గుప్పిట్లోకి తీసుకుని వ్యాపారం చేస్తున్నా, అధికారులు నిరోధించడం లేదని హంసారెడ్డి విమర్శించారు. భవిష్యత్తు అవసరాలకు, ఇతర కార్యకలాపాలకు ప్రభుత్వ భూములు లేకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు ఇవ్వడం లేదని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందడం లేదని, రాజకీయ నాయకుల జోక్యం వల్ల అసలైన లబ్ధిదారులు మోసపోతున్నారని అన్నారు. వయసు పైబడిన వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ప్రభుత్వం చేయూత పింఛన్లు, ఇతర హామీలు అమలు కావడం లేదని, అయితే బస్సు ఛార్జీలు, రైలు ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని హంసారెడ్డి ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన పలు డిమాండ్లు చేశారు. పేద, మధ్యతరగతి ప్రజల సమస్యలను పరిష్కరించాలి, విద్యా, వైద్య రంగాలను ప్రైవేటు రంగం నుంచి ప్రభుత్వ రంగంలోకి తీసుకురావాలి, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలి, పెంచిన బస్సు ఛార్జీలు, ఇతర అన్ని రకాల నిత్యావసర ధరలను నియంత్రించాలి, భూభారతి చట్టంలో గ్రామాల్లో రైతులకు అనుకూలంగా ఎలాంటి లొసుగులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కూతురు ఇంద్రారెడ్డి, దామెర గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

# క్రీడా పాఠశాలల రాష్ట్ర స్థాయి పోటీలకు కాళేశ్వరం విద్యార్థిని శాన్వి ఎంపిక



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం, కాళేశ్వరం ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థిని కోల శాన్వి, రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలల ప్రవేశ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెంటి శ్యామ్ తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన క్రీడా పోటీల్లో శాన్వి పాల్గొని జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. ఈ విజయం సాధించడంతో, జులై 1 నుంచి హైదరాబాద్‌లోని హకీంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్స్ పోటీల్లో ఆమె పాల్గొననుంది. మారుమూల గ్రామానికి చెందిన బాలిక రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. శాన్వికి స్పోర్ట్స్ స్కూల్లో అడ్మిషన్ లభించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర:** ఆరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా నాయకులు వాడికారి లక్ష్మణ్ రావు నానమ్మ, అలాగే ఆరె సంక్షేమ సంఘం నాయకులు, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నాయకులు వాడికారి సాంబయ్య తల్లి రాధాబాయి అకాల మరణం చెందారు. ఈ సందర్భంగా, ఆరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొల్లూరి కందరావు, కమలాపూర్ మండల అధ్యక్షుడు కదం రాములు, జిల్లా నాయకులు వాడికారి నరహరి, జిల్లా ముఖ్య సలహాదారులు నాగూర్ల సంతోషరావు, శ్రీనివాస్ తదితరులు గుంటూరుపల్లెలోని వారి నివాసానికి వెళ్లి రాధాబాయి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పల్లె దవాఖాన డాక్టర్లను మెడికల్ ఆఫీసర్లుగా గుర్తించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ పల్లె దవాఖాన డాక్టర్స్ అసోసియేషన్ – ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్లు తెలంగాణ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సర్వే సంగీత సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెండింగ్ జీతాలు, మెడికల్ ఆఫీసర్‌గా గుర్తించడం, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఉద్యోగ బదిలీలు వంటి తమ డిమాండ్లను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. పెండింగ్ జీతాల గురించి త్వరలోనే ప్రభుత్వంతో చర్చించి ప్రతినెలా సమయానికి జీతాలు అందేలా చూస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. గ్రామస్థాయిలో పల్లె దవాఖాన డాక్టర్లు అందిస్తున్న వైద్య సేవలు, వాటిలోని లోటుపాట్ల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ అరుణ్ కుమార్, లేడీ రిప్రజెంటేటివ్స్ డాక్టర్ విజయ, డాక్టర్ చాముండేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సురేష్, సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ హరికృష్ణ, తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పులి అనిల్ కుమార్ తదితర వైద్యులు పాల్గొన్నారు.

# రామాలయానికి నక్షత్ర హారతి అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ముసునూరి నరేష్ పర్యవేక్షణలో ఈ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా, గణపురం గాంధీనగర్ వాస్తవ్యులు ఎలిగేటి సంధ్యారాణి – మురళి (ఆర్టీసీ డ్రైవర్) దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజ అనంతరం వారు ఆలయానికి రూ.5,000 విలువైన నక్షత్ర హారతిని, ఇతర పూజా సామాగ్రిని అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్, కమిటీ సభ్యులు మూల శ్రీనివాస్ గౌడ్, బండారు శంకర్, బటిక స్వామి, మాదాసు అర్జున్, బూర రాజగోపాల్, మాదాసు మొగిలి, పాండవుల భద్రయ్య, దయ్యాల భద్రయ్య, ఉయ్యాల భిక్షపతితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్, ఉపాధ్యాయ బృందం పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ పాములపర్తి వేంకట నరసింహారావు భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజం వేసి, కుంటుతున్న వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించిన ఘనతను సొంతం చేసుకున్న వ్యక్తి అని కొనియాడారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో తగిన సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తికాలం పాటు నడిపించడం ఆయన గొప్ప పరిపాలనా దక్షతకు నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచరాజు కుమార్, మేకల సత్యపాల్, అంగన్‌వాడీ టీచర్లు బీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# డిప్యూటీ డీఎంహెచ్ఓలకు సమ్మె నోటీస్ అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా, జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మహాధర్నాకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ ఆధ్వర్యంలో శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ/డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఐ.ప్రకాష్, వర్ధన్నపేట డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్యలకు సంయుక్తంగా సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా జన్ను కొర్నేల్ (వరంగల్ జిల్లా ఎన్ హెచ్ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు) మాట్లాడుతూ, జూలై 9న జరిగే మహాధర్నాకు వరంగల్ జిల్లాలోని 78 క్యాడర్ల NHM కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నా రోజున ఉద్యోగులకు సెలవు ప్రకటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓలను కోరారు. ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా సంయుక్తంగా మాట్లాడుతూ పలు డిమాండ్లు చేశారు. 7 నెలల ఏరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలి, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలి, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి, ఉద్యోగులకు హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆచంట అభిషేక్, ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు యాకూబ్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పంటల బీమా అమలు చేయాలి

## తెలంగాణ రైతు రక్షణ సమితి డిమాండ్



**వరంగల్ వాయిస్, నడికూడ:** పంటల బీమా పథకం అమలులో లేకపోవడం వల్ల అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా తుడిచిపెట్టుకుపోతున్నా ఆదుకునే వారే కరువయ్యారని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికేల కిషన్ రావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో తక్షణమే పంటల బీమా పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసాధారణ వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల బెడద, ఇతర ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు పదేపదే నష్టపోతున్నారని, వారిని ఆదుకునేందుకు పంటల బీమా పథకం లేకపోవడం విచారకరమన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలు కాకపోవడం వల్ల రైతు సమాజం యొక్క ఆర్థిక స్థిరత్వం, నైతికత తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పీఎంఎఫ్‌బీవై కింద ప్రీమియం సబ్సిడీల ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాన్ని స్వీకరించకపోవడం లేదా ప్రత్యామ్నాయ పథకాన్ని తీసుకురాకపోవడం ఆందోళనకరంగా ఉందని వరికేల కిషన్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో చేరడంతో పాటు రైతుల వాటా ప్రీమియం కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు పంటల బీమా అమలు చేసి, రాష్ట్ర రైతాంగాన్ని నష్టాల పాలు కాకుండా రక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# మహా న్యూస్ ఆఫీస్‌పై దాడి హేయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హైదరాబాద్‌లోని మహా న్యూస్ కార్యాలయంపై బీఆర్ఎస్ చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి పవన్ అన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మీడియా వారధిలా పనిచేస్తుందని పేర్కొన్నారు. మీడియాలో వచ్చిన వార్తలు తప్పుగా అనిపిస్తే వాటిని ఖండించాలి గానీ, ఇలాంటి దాడులు చేయడం సరైనది కాదని స్పష్టం చేశారు. ఈ దాడిలో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# జులై 3న పోలీస్ శిక్షణ కళాశాలలో పాత వస్తువుల వేలం

**వరంగల్ వాయిస్, మామునూర్:** వరంగల్ పోలీస్ శిక్షణ కళాశాలలో వినియోగానికి పనికిరాని, పాత వస్తువులను జులై 3వ తేదీ ఉదయం 10:30 గంటలకు వేలం వేయనున్నట్లు పోలీస్ కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో సర్వీసు పూర్తయిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, పాత ఇనుప సామాగ్రి, కలప సంబంధిత వస్తువులు, టెంట్లు, ప్లాస్టిక్ వస్తువులు మొదలైనవి ఉంటాయి. ఆసక్తిగల కొనుగోలుదారులు తమ ఆధార్ కార్డుతో జులై 3న ఉదయం 10:30 గంటలకు మామునూర్, వరంగల్‌లోని పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో జరిగే వేలంపాట కార్యక్రమంలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాల కోసం ఆర్.ఐ. మహేష్ (8712597562, 9640333445) నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# నర్సరీని పరిశీలించిన డీఎల్పీఓ




**వరంగల్ వాయిస్, దామెర:** నర్సరీలోని మొక్కలను నాటడానికి సిద్ధం చేయాలని డీఎల్పీఓ రవిబాబు అన్నారు. శనివారం ఆయన దామెర మండలంలోని పసరగొండ గ్రామంలోని డంపింగ్ యార్డు, వర్మీ కంపోస్ట్ బెడ్‌లు, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ, వర్షాలు వస్తున్నందున మొక్కలు నాటడానికి సిద్ధం చేయాలని, ముఖ్యంగా రోడ్డు పక్కన అవెన్యూ ప్లాంటేషన్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# స్పీడ్‌గా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- విద్యార్థులకు మంచి బోధన అందించాలి
- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ కమిటీలు, ప్రభుత్వ సూచనల ప్రకారం జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగంగా కొనసాగిస్తున్నామని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శనివారం కురవి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, విద్యాబోధనలు, వైద్య ఆరోగ్య సేవలను పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కోసం జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకొని ముందుకు సాగుతోందని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక బృందాలలో సభ్యులుగా ఉన్న మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి ఇంటి నిర్మాణానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇంటి నిర్మాణానికి కావాల్సిన అన్ని వసతులను క్షేత్రస్థాయిలో సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మార్కింగ్, భూమి పూజ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అధికారులు పాల్గొని లబ్ధిదారులకు తగిన సూచనలు, సలహాలు అందించి ఇళ్ల నిర్మాణం కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోనే జిల్లాను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకంలో ఆదర్శంగా నిలిపేందుకు సంబంధిత అధికారులందరూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి సెలవుల అనంతరం జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా అన్ని విద్యాసంస్థలలో అధికంగా అడ్మిషన్లు కల్పించామని, జిల్లా విద్యాశాఖ యంత్రాంగం ప్రభుత్వ సూచించిన ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న పిల్లలందరికీ అత్యుత్తమ విద్యాబోధనలు అందించాలని, సబ్జెక్టుల నైపుణ్యత, విద్యార్థుల స్థితిగతులను పరిశీలిస్తూ క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. నాణ్యమైన ఆహార పదార్థాలతో మధ్యాహ్న భోజనం అందించాలని, విద్యతోపాటు సాంస్కృతిక, క్రీడల్లో వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. వసతి గృహాలలో చదువుతున్న వారికి మెనూ ప్రకారం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, స్నాక్స్, డిన్నర్‌లను అందించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా విద్యార్థుల యొక్క హెల్త్ ప్రొఫైల్ మెయింటైన్ చేయాలని, పాఠశాలలు, వసతి గృహాలలో క్రమం తప్పకుండా సానిటేషన్ నిర్వహించాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, మాతా శిశు మరణాలను తగ్గించాలని, సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా తదితర విష జ్వరాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక ఎంపీడీఓ రఘుపతి రెడ్డి, కురవి తహసీల్దార్ బి. విజయ, జడ్పీ స్కూల్ హెచ్ఎం వహీద్, బొందిలి వెంకన్న తదితర అధికారులు ఉన్నారు.

# ఎల్ బీ కళాశాలలో ఆర్మీ ఉద్యోగాలపై అవగాహన



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** స్థానిక లాల్ బహదూర్ కళాశాలలో (ఎల్‌బీ కళాశాల) ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఆర్మీలో ఉద్యోగ అవకాశాలు మరియు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డి.హెచ్. రావు తెలిపారు. ఇంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. రాజేందర్ రెడ్డి పర్యవేక్షణలో కళాశాల ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆపరేషన్ సింధూర్‌లో (కాశ్మీర్‌లో) పాల్గొన్న ఎల్‌బీ కళాశాల పూర్వ విద్యార్థి, ఎన్‌సీసీ క్యాడెట్ నాగరాజు ఈ కార్యక్రమంలో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఆపరేషన్ సింధూరలో పాల్గొనడం ఎంతో గర్వంగా ఉందని, భారత ఆర్మీలో ఉద్యోగం రావడం, ఎల్‌బీ కళాశాలలో చదువుకోవడం వల్లే ఇంతటి గొప్ప అవకాశం దొరికిందని పేర్కొన్నారు. పిల్లలకు ఎల్‌బీ కళాశాల ఎన్‌సీసీ ఒక ప్రయోగశాల లాంటిదని, ఇంతటి గొప్ప అవకాశం కల్పించినందుకు కళాశాలను అభినందించారు. విద్యార్థులు భారత ఆర్మీలో చేరాలని, దానికి ఎన్‌సీసీ ఎంతో దోహదపడుతుందని, ఎన్‌సీసీ సర్టిఫికేట్ ద్వారా నేరుగా ఆర్మీలో పాల్గొనవచ్చని తెలిపారు. ఇంతటి గొప్ప అవకాశం ఎల్‌బీ కళాశాలకే సొంతమని విద్యార్థులకు ప్రేరణ కల్పించారు. ఆపరేషన్ సింధూరిలో పాల్గొన్న నాగరాజును ప్రిన్సిపల్ రాజేందర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో భావోద్వేగానికి గురై చప్పట్లతో ఆడిటోరియాన్ని మార్మోగించారు. కార్యక్రమంలో విద్యార్థులకు వారి వ్యక్తిగత అంశాలు, నైపుణ్యం, స్కిల్ డెవలప్‌మెంట్, స్టేజ్ ఫియర్ వంటి భయాన్ని పోగొట్టడానికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. రాజేందర్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, ఎస్. సతీష్ కుమార్, కె. యాకయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ అడ్డుకోవడం సిగ్గుచేటు

- కేయూ విద్యార్థి సంఘాలు



**వరంగల్ వాయిస్, కేయూ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అడ్డుకోవడం సిగ్గుచేటని కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాలు తీవ్రంగా ఖండించాయి. శనివారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో జరిగిన విద్యార్థి సంఘాల సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నుంచి డా. సయ్యద్ వలీ ఉల ఖాద్రి, పీడీఎస్ యూ నుంచి దుర్గం సారయ్య, గిరిజన శక్తి నుండి గుగులోతు రాజు నాయక్, టీజీవీపీ నుంచి మెడ రంజిత్, పరిశోధక నాయకులు మట్టెడ కుమార్, టీ.ఎస్.పీ నుంచి కన్నం సునీల్, బీ.ఎస్.ఎఫ్ నుంచి దుప్పటి కిషోర్, కడాపాక రాజేందర్, బొట్ల మనోహర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించాలనే మంచి ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ప్రారంభించాలని నిర్ణయించిందని వారు తెలిపారు. దీనిలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ప్రారంభించడానికి యూనివర్సిటీని సంప్రదించగా, పోలీస్ క్యాంపును తొలగించి ఆ స్థలాన్ని కేటాయించారని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని అన్ని ప్రజాస్వామ్య విద్యార్థి సంఘాలు స్వాగతించాయని వెల్లడించారు.అయితే, కొన్ని విద్యార్థి సంఘాలు సొంత రాజకీయ ఎజెండాతో కుట్రలు చేసి ఈ స్కూల్‌ను అడ్డుకోవాలని చూస్తున్నాయని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ వస్తే పేద, మధ్యతరగతి విద్యార్థులకు మంచి విద్య అందుతుందని, నగరంలో మంచి వాతావరణంలో విద్య పొందే అవకాశం ఉంటుందని, యూనివర్సిటీ పరిధిలో పెడితే రోడ్డు, రవాణా సౌకర్యాలు కూడా అనుకూలంగా ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు. కాబట్టి, వెంటనే స్కూల్ నిర్మాణం చేపట్టి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కొందరు కావాలనే కుట్రలు చేసి అడ్డుకోవాలని చూస్తున్నారని, వారి ప్రయత్నాలు ఫలించవని, ప్రభుత్వం స్కూల్ నిర్మాణం చేపట్టి ప్రారంభించాలని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ హనుమకొండ జిల్లా అధ్యక్షులు వంశీ కృష్ణ, సౌరవ్ రాహుల్ వర్ధన్, శివ రెడ్డి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, జూన్ 28, 2025

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారం

● వన మహోత్సవంలో ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, సుబేదారి:** వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ప్రాంగణంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, "పర్యావరణ పరిరక్షణకు మొక్కలే ఆధారం. మన ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు పచ్చదనం అత్యవసరం" అని ఉద్ఘాటించారు. రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యం, అకాల వర్షాలు, విపరీతమైన ఎండలు మన జీవితాలకు ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వన మహోత్సవం వంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచే అవకాశంగా మారాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవానికి ప్రత్యేక దృష్టి సారించి ప్రణాళికలు చేపట్టిందని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నగరంలో విస్తృతంగా మొక్కలు నాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని కళాశాల భవనాన్ని పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, ఇతర అధ్యాపకులు కళాశాలకు సంబంధించిన రోడ్డు, మరుగుదొడ్లు, సెమినార్ హాల్ పునరుద్ధరణ వంటి పలు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ పనులన్నింటికీ అంచనాలు వేసి నివేదికలు పంపించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపించాలి

◆ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో కమలాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల పార్టీ ముఖ్యుల సమావేశం శనిగరపు రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సీపీఐ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉంటేనే మేలు జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారని, నిత్యం ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులేనని ఆయన అన్నారు. కమ్యూనిస్టులు బలంగా ఉంటేనే సమాజంలో ప్రజలకు రక్షణ ఉంటుందని చెప్పారు. మావోయిస్టులను కగార్ ఆపరేషన్ పేరుతో హత్య చేయడం సరికాదని, మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసి కమ్యూనిస్టులతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, ఎల్కతుర్తిలో ట్రిపుల్ ఐటీ విద్యా కేంద్రాన్ని నెలకొల్పి ఈ ప్రాంత అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఊట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మంచాల రమాదేవి, నకిర్త ఓదెలు, జక్కు రాజు గౌడ్, ఆదరి రమేష్, మర్రి శ్రీనివాస్, కొంగల రామచంద్రారెడ్డి, తిరుమల, మర్రి విజయ్, బొంత మల్లయ్య, చంద్రమౌళి, సుంచు కుమారస్వామి, తండ ముండయ్య, నిమ్మల మనోహర్, గడ్డం లలిత, రాణి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలపై రాజకీయ పార్టీలది సవతి తల్లి ప్రేమ

- 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే ఎన్నికలకు పోవాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బీసీల పట్ల అన్ని రాజకీయ పార్టీలు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయని, జనాభా దామాషా ప్రకారం బీసీల వాటా ఇచ్చేంత వరకు అవిశ్రాంత పోరాటం చేస్తామని, గల్లి నుండి ఢిల్లీ వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. శనివారం హనుమకొండ ఫాతిమా నగర్‌లోని వైష్ణవి గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన "స్థానిక సంస్థల ఎన్నికలు – బీసీల రిజర్వేషన్ల పెంపు" అనే అంశంపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. నెల రోజుల్లో రిజర్వేషన్లు నిర్ణయించి ఎన్నికల సంఘానికి నివేదించాలని హైకోర్టు ఆదేశించినా, ప్రభుత్వం ఇంకా చర్యలు చేపట్టడం లేదన్నారు. బీజేపీ నాయకులు "గల్లీలో ఒక మాట, ఢిల్లీలో మరో మాట" చెబుతూ రోజుకో రకంగా బీసీలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ బీసీల వ్యతిరేక పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలు మాత్రమే రిజర్వేషన్లను తేల్చాలని డిమాండ్ చేశారు. 48 గంటల్లోగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి రిజర్వేషన్ల అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీజేపీకి బీసీల ఓట్లు కావాలంటే, 42శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన అన్నారు. మరోవైపు, ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని డైవర్ట్ చేయడానికే ఎమ్మెల్సీ కవిత బీసీ నినాదం ఎత్తుకున్నారని జాజుల శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని బీసీ రిజర్వేషన్ల అంశం ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే, బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్ష పదవి బాధ్యతలను బీసీలకు అప్పగించాలని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తానని వారి అధినేత కేసీఆర్‌తో ప్రకటింపజేయాలని అప్పుడే బీసీలు బీఆర్ఎస్ పార్టీని నమ్ముతారని సూచించారు. అసలు స్థానిక సంస్థల కోటాలో 34శాతం ఉన్న రిజర్వేషన్లను 18 శాతానికి కుదించి బీసీలకు తీరని అన్యాయం చేసిందే బీఆర్ఎస్ పార్టీ అని, అలాంటి బీఆర్ఎస్ పార్టీని బంగాళాఖాతంలో కలిపి, బీసీలకు మద్దతిచ్చిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చామన్నారు. అలాగే, బీసీలంటే చిన్నచూపు చూస్తున్న బీజేపీ రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారంలోకి రావాలంటే, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ఆమోదింపజేసి, గవర్నర్‌కు పంపిన బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద ఉందని, త్వరలో జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి, 42శాతం బీసీ బిల్లును ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తెలంగాణలో బీజేపీని మట్టి కరిపిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు డా. చిర్ర రాజు, తమ్మేలా శోభరాణి, మాదం పద్మజాదేవి, కాసగాని అశోక్ గౌడ్, డా. సంగాని మల్లేశ్వర్, వేముల మహేందర్, వల్లాల జగన్ గౌడ్, పంజాల మధు, తెల్ల కిషోర్, తెల్లా సుగుణ, బూర్గుల ప్రమోద, బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకేనా?




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలో ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ కార్యకర్తలకే మంజూరు చేస్తున్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ సభ్యులు ఆయుధం రవి ఆరోపించారు. శనివారం ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బాగాజీ రజనీకాంత్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ జాక్ మెంబర్ మైదం రవి (ఆయుధం రవి) మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బడుగు, బలహీన వర్గాలైన అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండా సొంత పార్టీ కార్యకర్తలకే మంజూరు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలు పేదవారికి అమలు కావడం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు చుక్క రత్నాకర్, మదాసీ సుధాకర్ పాల్గొన్నారు.

# బనకచర్ల ప్రాజెక్టుపై కవిత వ్యాఖ్యలు అర్ధరహితం

## టీడీపీ నాయకుడు కందుకూరి నరేష్




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** బనకచర్ల ప్రాజెక్టుపై ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని తెలుగుదేశం పార్టీ పరకాల నియోజకవర్గ బాధ్యులు కందుకూరి నరేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ మోహన్ రెడ్డిల హయాంలోనే మిగులు జలాలపై చర్చలు జరిగాయని గుర్తుచేశారు. నాటి ఒప్పందాన్ని నేడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్సీ కవిత అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిని కోరుకుంటున్నారని నరేష్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీ వేదికగా చర్చ పెడదామన్న సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను బీఆర్ఎస్ స్వీకరించి, తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని కందుకూరి నరేష్ ధీమా వ్యక్తం చేశారు.

# మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ వెబ్‌సైట్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, పరకాల:** తెలంగాణ మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ (టీఎంజీఓ) వెబ్‌సైట్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టీఎంజీఓ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన్ ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త కిరణ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. త్వరలో ముఖ్యమంత్రితో రాష్ట్రవ్యాప్తంగా మీసేవ ఆపరేటర్ల సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి ఒక్క ఆపరేటర్ ఈ సమావేశానికి హాజరు కావాలని రాష్ట్ర నాయకులు కోరారు. తెలంగాణ రాష్ట్ర మీ సేవ లావాదేవీలు 20 కోట్లు పూర్తి చేసుకున్నందుకు ఆపరేటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నారగాని రమేష్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. తెలంగాణ మీసేవ ఆపరేటర్ అసోసియేషన్ సభ్యత్వాలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నారగాని రమేష్ కోరారు.

# అన్నారం షరీఫ్ దర్గాలో వృద్ధ దంపతులపై దాడి

◆ దర్గా సిబ్బందిపై తీవ్ర విమర్శలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని ప్రముఖ యాత్ర స్థలం అన్నారం షరీఫ్ దర్గాలో హృదయవిదారక సంఘటన వెలుగులోకి వచ్చింది. తమపై మంత్రాలు చేశారని అనుమానించిన ఓ వ్యక్తి వృద్ధ దంపతులపై దాడి చేశాడు. ఈ దాడి రాత్రి సమయంలో జరగగా, దర్గా సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంతో ఘర్షణను ఆపేవాళ్లు, అడ్డుకునేవాళ్లు ఎవరూ లేకపోయారు.

## సీసీటీవీల పనితీరు, సిబ్బంది నిర్లక్ష్యం..

ఈ ఘటన జరిగిన సమయంలో కీలక ఆధారాలను అందించగల సీసీటీవీ కెమెరాలు పనిచేయకపోవడం పోలీసు దర్యాప్తును గణనీయంగా అడ్డుకుంది. దాడికి సంబంధించిన స్పష్టమైన ఫుటేజ్ అందుబాటులో లేకుండా పోయింది. దాడి సమయంలో దర్గా సిబ్బంది లేకపోవడం వారి విధి పట్ల నిబద్ధతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. జిల్లా మైనారిటీ అధికారి, స్థానికులు సిబ్బంది పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది తమ విధులను ఖచ్చితంగా పాటించాలని జిల్లా మైనార్టీ అధికారులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, భక్తుల భద్రతను చూసుకోవడంలో, నిఘా వ్యవస్థలను నిర్వహించడంలో సిబ్బంది అసమర్థత స్పష్టంగా తెలుస్తుంది.

## పోలీసు దర్యాప్తుకు అడ్డంకులు..

సాక్ష్యాలు లేకపోవడంతో పోలీసులు దర్యాప్తులో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయడానికి వారు స్థానిక వ్యక్తిని సంప్రదించారు. అయితే, దర్గా సిబ్బంది ఆ వ్యక్తి ఫిర్యాదును అడ్డుకోవడం వారి పనితీరుపై మరింత విమర్శలకు దారితీసింది. సంఘటన తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు, దర్గా నిర్వహణపై ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పనిచేయని సీసీ కెమెరాలు, సిబ్బంది గైర్హాజరు భక్తుల భద్రత గురించి తీవ్ర ఆందోళనలను రేకెత్తించాయి. ఈ ఘటనపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సైడ్ డ్రైనేజీకి శంకుస్థాపన, ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 65వ డివిజన్‌లోని నిపూర్ నగర్ తండా, శివ గార్డెన్స్ నుంచి రైల్వే ట్రాక్ వరకు 80 లక్షల రూపాయల సాధారణ నిధులతో నిర్మించనున్న నూతన సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు. అనంతరం, నిపూర్ నగర్ తండాకు చెందిన హలవాత్ అనిత – దేవేందర్, పోరిక అరుణలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, గత పాలకుల చేతుల్లో అభివృద్ధికి నోచుకోని అన్ని ప్రాంతాలను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికార యంత్రాంగం కలిసికట్టుగా ముందుకు వెళ్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సకాలంలో పనులను ప్రారంభించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అట్టడుగు వర్గాలకు అండగా ఉండాలని అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుగులోతు దివ్య రాణి, హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, ఆత్మకూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, హసన్‌పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, ఆత్మకూర్ మార్కెట్ వైస్ చైర్మన్ తంగేళ్ల పల్లి తిరుపతి, వీసం సురేందర్ రెడ్డి, మదన్ గౌడ్, మడిపల్లి మాజీ సర్పంచ్ విజయ్ గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల పవన్ కళ్యాణ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు మాట్ల విష్ణు, తిరుపతి, ప్రవీణ్, కుమార్, పోలేపాక అశోక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణకు సమన్వయంతో పని చేయాలి

● అడిషనల్ డీసీపీ రవి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బాలలను సంరక్షించడానికి అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ అడిషనల్ డీసీపీ ఎన్. రవి సూచించారు. జూలై 1 నుంచి నెల రోజుల పాటు నిర్వహించబడే “ఆపరేషన్ ముస్కాన్ – 11వ విడత” కార్యక్రమంపై అదనపు డీసీపీ ఆధ్వర్యంలో శనివారం కమిషనరేట్ కార్యాలయంలో అధికారుల సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. హ్యూమన్ ట్రాఫిక్ విభాగంతో పాటు వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాలలోని వివిధ ప్రభుత్వ శాఖలైన స్త్రీ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్‌లైన్ (1098), విద్యాశాఖ, కార్మిక శాఖలకు చెందిన అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అడిషనల్ డీసీపీ ఎన్. రవి మాట్లాడుతూ, గత 11 సంవత్సరాలుగా ఆపరేషన్ స్మైల్ & ముస్కాన్ భారతదేశ వ్యాప్తంగా తప్పిపోయిన పిల్లలను, భిక్షాటన చేయుచున్న పిల్లలను, నిరాదరణకు గురైన పిల్లలను, ముఖ్యంగా బాల కార్మికులను సంరక్షించే ప్రాథమిక ఉద్దేశాలతో నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా బాధితులైన పిల్లల్ని సంరక్షించి వారి కుటుంబాలకు అప్పగించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం 11వ విడత ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని జులై 1 నుంచి 31 వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించి, బాలల సంరక్షణ కొరకు ప్రత్యేకంగా పోలీసు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. హాజరైన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేసి, జిల్లాలో బాలల సమస్యలు లేని విధంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌ను తెలంగాణ రాష్ట్రంలో ముందుండేలా కృషి చేయాలని సూచించారు. వివిధ శాఖల మధ్య ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే తప్పనిసరిగా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎవరైనా 18 సంవత్సరాలలోపు పిల్లల్ని హింసించినా, భిక్షాటన చేయించినా, బాల కార్మికులుగా మార్చినా అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు డీసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించడంతో పాటు హాజరైన అన్ని శాఖల ప్రతినిధులతో ఆపరేషన్ ముస్కాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్, ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు చాణక్య, వినోద్, రజిత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు వరంగల్, జనగాం నుంచి సుజాత, శ్రీలత, ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ సిస్టర్ సహాయ, మై ఛాయిస్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ జన్ను క్రాంతి, వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏర్పాటు చేయబడిన 9 పోలీసు టీమ్‌ల ఇన్‌ఛార్జ్ ఎస్ఐలు, సిబ్బంది, బాలల సంరక్షణ అధికారులు, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్లు, విద్యాశాఖ అధికారులు, ఎన్జీవో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ సిటీ పనులను పరిశీలించిన కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్‌లోని భద్రకాళి బండ్‌పై పూర్తయిన స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులను కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ శనివారం క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా భద్రకాళి బండ్‌పై ఏ, బీ, సీ, డీ జోన్‌ల వారీగా ఇప్పటికే పూర్తి చేసిన పనులు, వాటి అంచనా వ్యయాలతో పాటు సమగ్ర వివరాలను కమిషనర్ ఇంజనీరింగ్ స్మార్ట్ సిటీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొంది వాగు నుంచి వచ్చే నాలాతో పాటు పోతన జంక్షన్ ప్రాంతం నుంచి వచ్చే 12 మోరీల నాలాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా జోన్‌లలో మిగిలిపోయిన ఎలక్ట్రికల్, సివిల్ పనులను కూడా ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, స్మార్ట్ సిటీ ప్రతినిధులు ఆనంద్ ఓలేటి, శ్రీనివాసరాజు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** హసన్‌పర్తి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎమ్మార్వో చల్లా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హసన్‌పర్తి, హనుమకొండ మండలాల పరిధిలోని 81 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 81 లక్షల 09 వేల 396 రూపాయల విలువైన చెక్కులను, అలాగే 25 మంది సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) లబ్ధిదారులకు 7 లక్షల 20 వేల 220 రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, పాక్స్ చైర్మన్ బిల్లా ఉదయ్ కుమార్ రెడ్డి, మెరుగు రాజేష్ గౌడ్, చల్లా గోపాల్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రాజీవ్ గాంధీ, 65వ డివిజన్ కార్పొరేటర్ గుగులోత్ దివ్యరాణి, హసన్‌పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మాజీ వరంగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జోరిక పూలక్క, ఉపాధ్యక్షురాలు బత్తుల స్వాతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీర సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, పొన్నాల రఘు, అయ్యల రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాట్ల విష్ణు, మదన్ గౌడ్, భూక్యా రాజుతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాంధీ భవన్ ప్రజావాణిలో కుడా చైర్మన్ ఇనగాల అర్జీల స్వీకరణ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, స్టేట్ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ. ఫహీం పాల్గొన్నారు. వారు వివిధ రకాల ప్రజా సమస్యలను వినతిపత్రాల రూపంలో స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత శాఖ మంత్రులకు పంపించారు. ఈ ముఖాముఖి కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు తమ సమస్యలు, సూచనలు, అభిప్రాయాలను – ముఖ్యంగా భూ పంచాయతీలు, సీనియర్ సిటిజన్ సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, పార్టీలో పదవులు తదితర అంశాలపై వివరించారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎం.ఏ. ఫహీం రి సమస్యలను సావధానంగా వింటూ వినతిపత్రాలు స్వీకరించారు. కొన్ని సమస్యలకు ఫోన్ ద్వారానే మాట్లాడి తక్షణ పరిష్కారం చూపించారు.

వరంగల్ వాయిస్
సినిమా
శనివారం 28
జూన్ 2025
7

# డిమాండ్ పెంచేసిన శ్రీలీల

పెళ్లి సందడిసినిమాతో తెలుగు సినీ పరిశ్రమకు పరిచయమైన శ్రీలీల ఆ తర్వాత మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం పడలేదు. ఎందుకంటే ఆమెకు వరుస సినీ అవకాశాలు అలా వచ్చి పడ్డాయి. నిజానికి ఆమెకు ఎన్ని హిట్ సినిమాలు ఉన్నాయో అన్ని ఎ◌`లాప్ సినిమాలు కూడా ఉన్నాయి. కానీ ఆమె డిమాండ్ మాత్రం తగ్గడం లేదు, సరికదా ఎప్పటికప్పుడు పెరుగుతోంది. ఇప్పటికే ఆమె రెమ్యూనరేషన్ చాలాసార్లు పెంచింది. తాజాగా బాలీవుడ్ ఆఫర్లు వస్తున్నందున ఆమె ఇప్పుడు మరోసారి రెమ్యూనరేషన్ పెంచినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం మేరకు శ్రీలీల ఏకంగా ఏడు కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగు సినిమా హీరోయిన్‌కి రెమ్యూనరేషన్ అంటే చాలా పెద్ద అమౌంట్ అని చెప్పాలి. అయితే బాలీవుడ్ నిర్మాతలు శ్రీలీలకు ఆ మొత్తం ఇవ్వడానికి ఏమాత్రం వెనకాడడం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె రెమ్యూనరేషన్ భారీగా పెంచింది. అయితే ఆమెకు 7 కోట్లు ఇవ్వడానికి తెలుగు నిర్మాతలు ప్రస్తుతానికి సిద్ధంగా లేరు. అందుతున్న సమాచారం మేరకు ఆమె ఇప్పటివరకు రెండున్నర కోట్లు ఒక్కో తెలుగు సినిమాకి తీసుకునేది. పుష్ప సినిమాలో ఐటమ్ సాంగ్ కోసం మూడు కోట్లు తీసుకుంది. ఇప్పుడు బాలీవుడ్‌లో అవకాశాలు రావడం మొదలుపెట్టాయి కదా అని, డబ్బులు డిమాండ్ చేసి ఏకంగా ఏడు కోట్లు అడుగుతున్నట్లు తెలుస్తోంది. ఒకవిధంగా అఖిల్ అక్కినేని లెనిన్ సినిమా నుంచి బయటకు వెళ్లిపోవడానికి కూడా ప్రధాన కారణం ఇదే అని అంటున్నారు.



## విజ్జూ.. నిన్ను గర్వపడేలా చేస్తా

### మైసాపై నటి రష్మిక ఆసక్తిక పోస్ట్

విజయ్ దేవరకొండతో రష్మిక డేటింగ్ అంటూ కొన్నేళ్లుగా రూమర్లు వస్తున్నా వీరు మాత్రం స్పందించ ట్లేదు. ఎప్పటికప్పుడు అడ్డంగా దొరికిపోతూనే ఉన్నారు. తాజాగా రష్మిక చేసిన పోస్టు వీరిద్దరి డేటింగ్ ను కన్ఫర్మ్ చేసేలా ఉంది. రష్మిక తన మైసా సినిమాను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ఈ మూవీకి స్టార్ హీరోలు విషెస్ చెబుతున్నారు. తాజాగా విజయ్ దేవరకొండ కూడా ఆమెకు కంగ్రాట్స్ చెబుతూ విషెస్ చెప్పారు. ఇది అద్భుతంగా ఉంటుంది అని ఇన్ స్టా స్టోరీలో పోస్ట్ చేశాడు. దానికి రష్మిక విజయ్ దేవరకొండను ఉద్దేశిస్తూ రిప్లై ఇచ్చింది. 'విజ్జూ ఈ సినిమాతో నిన్ను గర్వపడేలా చేస్తానని మాటిస్తున్నా' అంటూ లవ్ ఎమోజీతో రిప్లై ఇచ్చింది. ఆమె చేసిన ఈ పోస్టు కాస్త వైరల్ అవుతోంది. విజయ్ దేవరకొండను విజ్జూ అంటూ పిలవడం అందరికీ ఆశ్చర్యంగా అనిపిస్తోంది.





## తమ్ముడు చిత్రానికి ఏ సర్టిఫికెట్

టాలీవుడ్ నటుడు నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం తమ్ముడు వకీల్ సాబ్ ఫేమ్ వేణు శ్రీరామ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కన్నడ నటి సప్తమి గౌడ కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రాన్ని జూలై 4న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు మేకర్స్. ఇప్పటికే ట్రైలర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు ఏ సర్టిఫికెట్‌ను అందించింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ సినిమాలో లయ, స్వశిక, వర్ష బొల్లమ్మ, సౌరభ్ సచ్‌దేవా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ వెంకటేశ్వర బ్యానర్‌పై దిల్ రాజు నిర్మించిన ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందించారు.

## హరిహరవీరమల్లు ఆలస్యం.. అభిమానుల్లో అసహనం

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ చిత్రం పై అభిమానులు ఏ స్థాయిలో ఆశలు పెట్టుకున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఆ అంచనాలకు మేకర్స్ అనుగుణంగా స్పందించకపోవడంపై అభిమానుల్లో అసంతృప్తి పెరిగిపోతోంది. ఇప్పటికే చాలా కాలం క్రితమే షూటింగ్ పూర్తి అయినప్పటికీ, చిత్ర బృందం నుంచి సరైన అప్డేట్స్ లేకపోవడం అభిమానులకు తీవ్ర నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ వారం ట్రైలర్‌కు సంబంధించి అప్డేట్ వస్తుందని ప్రకటించినప్పటికీ, అది ఇప్పటివరకు విడుదల కాలేదు. వారం ముగియబోతున్నా కూడా కనీసం ఒక టీజర్, పోస్టర్, గ్లింప్స్ లాంటి ఏదైనా చిన్న హింట్ ఇవ్వకుండా, పూర్తిగా నిశ్శబ్దంగా ఉండిపోవడం వలన ఫ్యాన్స్ నిరాశకు లోనవుతు న్నారు. దీంతో చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా కూడా ప్రమోషన్ పరంగా ఏమీ చేయకపోవడాన్ని అభిమానులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సినిమా రిలీజ్‌ను మళ్లీ మళ్లీ వాయిదా వేయడమే కాదు, ఇప్పుడు ట్రైలర్ అప్డేట్స్ విషయంలో కూడా అజాగ్రత్తగా వ్యవహరించడం అభిమానులకు నిజమైన 'వర్ట్స్ ఎక్స్‌పీరియన్స్'గా మారుతోంది. ఇప్పటికే సినిమా ఎన్నోసారి వాయిదా పడిరది. పవన్ కళ్యాణ్ షూటింగ్ పూర్తి చేసినప్పటికీ సినిమా విడుదలపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం, దానికి తోడు తాజా ట్రైలర్ అప్డేట్ విషయంలోనూ స్పష్టత లేకుండా మేకర్స్ వ్యవహరించడం వల్ల ఫ్యాన్స్ ఆగ్రహంగా ఉన్నారు. మొత్తంగా చూస్తే, 'హరిహర వీరమల్లు'పై ఉన్న హైప్‌ను సద్వినియోగం చేసుకోవడంలో చిత్రబృందం పూర్తిగా విఫలమైందని చెప్పాలి. ఎంత భారీ బ్జడెట్, స్టార్ కాస్ట్ ఉన్నా.. ఇలా అప్డేట్‌లు లేకుండా డిజప్పాయింట్ చేయడం అభిమానులకు నిజంగా బాధ కలిగించే విషయం.






## అప్పడు నటనను వదిలేస్తా..

'సితారే జమీన్ పర్' అంటూ ప్రేక్షకుల ముందుకువచ్చి మనసులను కదిలించారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్. విమర్శకుల ప్రశంసలు అందుకుంటోన్న ఈ సినిమా విజయం తర్వాత ఆయన ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తనకు నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. అలాగే దర్శకత్వం వైపు వెళ్లకపోవడానికి గల కారణాన్ని వివరించారు. ఆమిర్‌ఖాన్ దర్శకత్వం వహించిన ఏకైక సినిమా 'తారే జమీన్ పర్'. హిట్ టాక్‌ను సొంతం చేసుకొని ఆయనకు పేరు తెచ్చిన ఆ సినిమా తర్వాత ఆయన దర్శకత్వం వహించలేదు. తాజాగా ఈ విషయంపై మాట్లాడుతూ.. 'పూర్తిగా దర్శకుడిగా మారకపోవడానికి ఏకైక కారణం నటనపై నాకున్న ఇష్టమే. ఈ పరిశ్రమలో దర్శకత్వం, నిర్మాణం రెండూ చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఒకవేళ నేను దర్శకత్వం వైపు వెళ్తే నటన బోరింగ్‌గా అనిపిస్తుంది. బోర్ కొట్టిన పనిని నేను చేయలేను. కాబట్టి నటన మానేస్తాను. 'తారే జమీన్ పర్'కు కూడా అనుకోని పరిస్థితుల్లో దర్శకత్వం వహించాను. అప్పుడు నేనున్న పరిస్థితులు అలా ప్రేరేపించాయి' అని చెప్పారు. ఇక ఆమిర్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'సితారే జమీన్ పర్' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. రాష్ట్రపతి ద్రౌపదీముర్ము కూడా దీన్ని వీక్షించి ప్రశంసించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆమె కోసం ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. మానసిక దివ్యాంగులు తమకున్న సమస్యను అధిగమించి ఎలాంటి విజయాన్ని అందుకున్నారన్నది ఇందులో హృద్యంగా చూపించారు.



# పీవీ తెలంగాణ ఠీవీ

- దేశం దశ, దిశ మార్చిన నేత పీవీ
- "కాంగ్రెస్ పీవీని విస్మరించడం శోచనీయం
- శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ
- బీఆర్ఎస్ నాయకుల ఘన నివాళి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** దేశం దశ, దిశ మార్చిన గొప్ప నాయకుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కొనియాడారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పీవీ నరసింహారావు 104వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిరికొండ మధుసూదనాచారి, మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్తో కలిసి పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హనుమకొండ బస్ స్టాండ్ జేఎన్ఎస్ స్టేడియంలోని పీవీ విగ్రహానికి కూడా పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం మధుసూదనాచారి మాట్లాడుతూ, తెలంగాణ మారుమూల పల్లె నుంచి వచ్చిన పీవీ గారు దేశ ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆయన బహుభాషా కోవిదుడని, ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన గొప్ప ఆర్థికవేత్త అని వివరించారు. కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులను అలంకరించి పార్టీకి వన్నె తెచ్చిన గొప్ప నాయకుడైన పీవీని కాంగ్రెస్ విస్మరించడం శోచనీయమని ఆయన అన్నారు.



## "తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ"
### - దాస్యం వినయ్ భాస్కర్

ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ అని, ఆయనకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సముచిత గౌరవం కల్పించారని అన్నారు. పీవీ శతజయంతిని సైతం అధికారికంగా ఘనంగా నిర్వహించారని గుర్తు చేశారు. భారత దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న సైతం పొందిన పీవీ దేశ ప్రధానిగా సేవ చేశారని, ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చిన గొప్ప ఆర్థికవేత్త అని కొనియాడారు. గొప్ప పాలన దక్షుడు పీవీ నరసింహారావు అని పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డ, తెలుగువాడు దేశ ప్రధానిగా సేవలు అందించడం తెలుగు వారందరికీ, తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముద్దసాని సహోదర్ రెడ్డి, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, నాయకులు జనార్దన్ గౌడ్, నాయీముద్దీన్, సల్వాజి రవీందర్ రావు, పున్నం చందర్, దశరథం, విజయ్ కుమార్, కిరణ్, రాకేష్ యాదవ్, శ్యాం కుమార్, సౌరం రఘు, సదాంత్, జేకే, వీరాస్వామి, స్నేహిత్, ఇమ్మడి రాజు, శ్రవణ్, నరేంద్ర, అనిల్, సృజన్, బచ్చు అనిల్ కుమార్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



## భారత్ ను అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చిన పీవీ
### - వొడితల సతీష్ కుమార్

దేశాన్ని ఆర్థికంగా శక్తివంతంగా, ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా తీర్చిదిద్దిన గొప్ప నాయకుడు పీవీ నరసింహారావు అని మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ అన్నారు. బంగారాన్ని తాకట్టు పెట్టే స్థితి నుంచి భారత దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా చేసిన నాయకుడు పీవీ అని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పీవీ శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించి వారికి సముచిత గౌరవాన్ని ఇచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ, తెలుగు బిడ్డగా పీవీ మనందరికీ గర్వకారణమని తెలిపారు. వంగరలో నిర్మిస్తున్న పీవీ స్మారకాన్ని త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. పీవీ జయంతి వేడుకలకు ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరమని అన్నారు.




# పీవీ సంస్కరణలతోనే పటిష్టంగా దేశ ఆర్థిక వ్యవస్థ

- తొలి తెలుగు ప్రధానిగా పీవీకి ప్రత్యేక స్థానం
- పీవీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** మాజీ ప్రధాని, కాంగ్రెస్ పార్టీ దివంగత నాయకుడు స్వర్గీయ పీవీ నరసింహారావు జయంతి వేడుకలను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని, కాంగ్రెస్ నాయకులు, ప్రతినిధులతో కలిసి పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హనుమకొండ బస్ స్టాండ్ ఆవరణలో ఉన్న పీవీ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, పీవీ ఆలోచనలు, ఆయన ఆర్థిక, పార్టీ, భారత రాజకీయ రంగాల్లో ప్రవేశపెట్టిన సంస్కరణలు మన దేశాన్ని అభివృద్ధి మార్గంలోకి తీసుకెళ్లాయని అన్నారు. ఒక తెలుగువాడిగా, దక్షిణ భారతదేశం నుంచి వచ్చిన తొలి ప్రధానిగా పీవీకి తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ వేదికలో నిలిపేలా ఆయన గ్లోబల్–ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. మన ప్రాంత బిడ్డ అయిన పీవీ నాయకత్వంలో పార్లమెంట్ సభ్యుడిగా పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని నాయిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బంక సంపత్, లక్ష్మారెడ్డి, రాజు, అంకుష్తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# వరంగల్ ఏఎస్పీగా శుభం ప్రకాష్

**వరంగల్ వాయిస్, పోలీస్ విభాగం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ డివిజన్ ఏ. ఎస్పీగా ఎన్. శుభం ప్రకాష్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన శుభం 2024 సంవత్సరంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ఆరు నెలల పాటు ట్రైనీ ఐపీఎస్ గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం వరంగల్ ఏసీపీగా పనిచేస్తున్న నందిరాం నాయక్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com